# జైలు కథలు 17

## "మానానికి ప్రాణం"

గతంలో పల్లెలు కాస్త ప్రశాంతంగా వుండేవి. కాని ఈ కుళ్ళు రాజకీయాలు పల్లెలకు వ్యాపించటంతో ప్రశాంతతకు ప్రమాదం వాటిల్లింది. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లుగా - ప్రతి వ్యక్తీ రాజకీయాల్తో హడావిడీ పడ్తున్నాడు. కల్మష మెరుగని మనసులు కూడా మాలిన్యంతో నిండుకున్నాయి. రాజకీయాలవల్లనే ముఠా తగాదాలు ప్రబలిపోయాయి. కాస్త మాట్లాడ గలిగినవాడు పల్లెల్లో పెద్ద రాజకీయ నాయకుడే మరి.

"సార్"....ఆలోచనలకు బ్రేక్‌పడింది. శబ్దంవేపు చూశాను.

"ఏం?" అన్నాను. కొంచెం చీకాకు కూడా ధ్వనించి వుండవచ్చు. "దయచేసి వొక యిన్‌లాండ్ లెటర్ సాయం చేయగలరా?" ఇంగ్లీషు పదాలు కలిసిన తెలుగు అభ్యర్థనలో సంస్కారం నిండుగా వుంది. కాని మనిషే మొరటుగా వున్నాడు. "నా కేసు విషయం భార్యకు జాబు వ్రాయాలి." మరలా అతనే అన్నాడు "కేసేవిటి?" నా ప్రశ్నకు సమాధానంగా, నా ప్రక్కనే కూర్చొని ప్రారంభించాడు.

* * *

కొల్లాపూర్ తాలూకాలోని చిన్న గ్రామం రామవరం. కొత్తగా వచ్చిన రాజకీయాల్తో పల్లె రాజుకుంటుంది. హరిజన వాడ కొంచెం పెద్దదనే చెప్పాలి. అందులో రెండు పార్టీలు. ఒక పార్టీ పెద్ద శివయ్య. మరో పార్టీ నాయకుడు సీతన్న. ఇద్దరికీ అక్షర జ్ఞానం వుంది. క్రితం నెలలో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో సీతన్నది పైచేయి అయింది. సీతన్న ఉపసర్పంచి అయాడు. శివయ్యకు గుండెల్లో ఎక్కడో చిన్నమంట బయలుదేరింది. పార్టీ పగ. అందునా అసూయ తోడైంది.

సీతన్న ఏకైక సంతానం సుగుణ. మంచి రూపసి. టెన్త్ చదువుతూంది. పేరుకు తగిన నడవడికలది. గ్రామంలో హైస్కూలు లేనందువల్ల, అయిదుమైళ్ళ దూరంలోవున్న కొల్లాపూర్‌లో చదువుతూంది. బస్‌లో వెళ్ళి వచ్చేది. బస్‌స్టేజీనుంచి హరిజనవాడ రెండు మైళ్ళుంది. ఆ రోజు ఏవో ఆటల పోటీలు వుండటంవల్ల ఆలస్యమైంది స్కూల్లో. లాస్ట్ బస్‌లో వచ్చింది. అప్పుడు సమయం రాత్రి పదకొండు. సీతన్న యింటివద్దలేదు. ఏదో పనిమీద మహబూబ్‌నగర్ వెళ్ళాడు. అందువల్ల బస్ స్టాప్‌కు ఎవరూ రాలేదు. కొల్లాపూర్‌లో ఏదో పని వుండి వెళ్ళిన శివయ్య అదే బస్‌లో వచ్చాడు. ప్రశాంతంగా నిద్రిస్తున్న ప్రకృతిలో కీచురాళ్ళ శబ్దం తప్ప మరేమీ వినిపించటంలేదు. ప్రత్యర్థి ప్రక్కవొంటరిగా ప్రయాణిస్తున్న సుగుణ శరీరం కొద్దిగా కంపించింది. అయినా అడుగులు ముందుకు వేసింది. కాని భయం వల్ల అడుగులు తడబడుతున్నాయి. ఆమె ముందు, అతను వెనుక నడుస్తున్నారు కాలిబాటవెంట. వెన్నెల్లో సుగుణ వంటి సొంపు వొంపులు వెనుకపాటుగా గమనిస్తున్న శివయ్య మనసు, వయసును కాస్త క్రిందికి దిగజార్చి కోరిక రేపింది. నిండైన పండు వెన్నెల. రంగు రంగుల



బట్టల్లో రమ్యంగా వుంది ముద్దమందారం లాటి సుగుణ. కదులుతున్న పిరుదులపై లయబద్ధంగా నాట్యం చేస్తూంది వాల్జడ. శివయ్య కళ్ళు కోరికతో మూసుకుపోయాయి. అందునా ప్రత్యర్థి బిడ్డ. అందుబాటులోవున్న అవకాశాన్ని జారవిడుకోదలచలేదు శివయ్య. నిర్ణయానికొచ్చాడు. మానవత్వాన్ని మరచాడు. నీతిని పాతేశాడు. ధర్మాన్ని దాని ఖర్మానికి వదిలేశాడు. పైపంచె చివరలు రెండు చేతులతోనూ పట్టుకొని. దాన్ని సుగుణ మొఖం మీదికి విసిరాడు. పంచె సరిగా ముక్కు, నోటిమీదపడింది. బిగించాడు. అరిచే వీలులేదు. పెనుగులాడింది. అర్థించే కళ్ళను ఆనందంగా ముద్దాడాడు. ఆఖరు ప్రయత్నంగా తనశక్తి నంతటినీ కూడదీసుకొని ప్రతిఘటించటానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో నిస్సహాయతగా అలసిపోయింది. జరుగకూడంది జరిగిపోయింది.

ఇల్లు చేరిన సుగుణ ఆ రాత్రే ఉరి పోసుకుంది. మహబూబ్‌నగర్ నుంచి తిరిగి వచ్చిన సీతన్న, సుగుణ వ్రాసి పెట్టిన జాబు ద్వారా అంతా గ్రహించాడు. రిపోర్టు ఇవ్వదలచలేదు. హృదయంలో బ్రద్దలైన అగ్నిపర్వతాల్నుంచి వెలువడిన లావా కన్నీటి సెగలుగా మారి క్రింద కురికింది. పోయిన తన కూతురు ప్రాణం తిరిగిరాదు. కాని తన కూతురు ప్రాణం పోవటానికి కారణభూతుడైన వాడి ప్రాణం నిలువరాదు. నిర్ణయానికి స్వరూపం కల్పించాడు. ఎవరికీ తెలియకుండా బాకు బొడ్లో దోపుకొని. శివయ్య యిల్లు చేరాడు. భార్యతో ముచ్చటిస్తున్న శివయ్య నోరు, సీతన్నదించిన పిడిబాకు జోరుతో శాశ్వతంగా మూతపడింది.

కథ ముగించిన సీతన్నకేసి చూశాను. కళ్ళనిండుగా నీరు. జైలుకు భయపడా?.... కాదు.... కాలగర్భంలో కలిసిపోయిన కన్నబిడ్డ కరుణామయగాథను తల్చుకుని అనుకున్నాను.

—ప్రసాద్